క్లుప్తంగా

విద్యకు క్రమశిక్షణ తోడవ్వాలి



నకరికల్లు: ప్రభుత్వం పంపిణీ చేస్తున్న మధ్యాహ్నభోజన పథకాన్ని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని టీడీపీ జిల్లా లీగల్ సెల్ ప్రధాన కార్యదర్శి షేక్.అలీబాషా సూచించారు. స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మధ్యాహ్న భోజన పథకాన్ని సోమవారం ప్రారంభించారు. విద్యార్థులకు మధ్యాహ్న భోజనంతో పాటు పండ్లు, మిఠాయిలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యకు మంచి క్రమశిక్షణ తోడైతే ఏ విద్యార్థి అయిన ఉన్నత శిఖరాలకు ఎదగవచ్చని అన్నారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు టి.నగేష్, ఫిజికల్ డైరెక్టర్ చింతా పుల్లయ్య, ఉపాధ్యాయినీ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

దివ్యాంగులకు ఉప కరణాలు పంపిణీ



రాజుపాలెం: మండలంలోని గణపవరం గ్రామ సచివాలయం-2 పరిధిలో అంగ వైకల్యం కలిగిన వారికి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి డాక్టర్ రవితేజ నాయక్ ఉప కరణాలను సోమవారం పంపిణీ చేశారు. చేతికర్రలు, మెడ బెల్టులు, నడుం బెల్టులు 31 మందికి అందజేశారు. ఈ సందర్భంగా డాక్టర్ మాట్లాడుతూ ఫ్లోరోసిస్ ఎముకుల సంబంధిత సమస్యలతో బాధపడుతున్న వారికి కేంద్ర ప్రభుత్వం ఈ ఉపకరణాలను అందిస్తుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో కమ్యూనిటీ హెల్త్ అధికారి శిరీషా బాయి, ఏఎన్ఎంలు ధనలక్ష్మి, ఆశా కార్యకర్తలు అనురాధ, సంతోషం తదితరులు పాల్గొన్నారు.

పారిశుద్ధ్యంపై ప్రత్యేక డ్రైవ్



క్రోసూరు: ఈ నెల 25 వ తేదీ నుంచి మండలంలోని అన్ని గ్రామ పంచాయతీల్లో చేపట్టిన పారిశుద్ధ్య కార్యక్రమాల ప్రత్యేక డ్రైవ్ ముమ్మరంగా కొనసాగుతోందని ఎంపీడీవో టీవీ రమణ సోమవారం తెలిపారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు గ్రామాల్లో అంటు వ్యాధులు ప్రబలకుండా అరికట్టేందుకు పారిశుద్ధ్య కార్యక్రమాలు ఆగస్టు 10వ తేదీ వరకు ప్రత్యేక డ్రైవ్ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఇందుకోసం కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేసి, ముగ్గురు అధికారులను పర్యవేక్షించే విధంగా ఫోన్ నంబరు 95426 03634 అందుబాటులో ఉంచామన్నారు. ఈ సందర్భంగా క్రోసూరు, నాగవరం, దొడ్లేరు, అనంతవరం, బయ్యవరం, ఊటుకూరు గ్రామాల్లో పారిశుద్ధ్య కార్యక్రమాలు చేపట్టినట్లు తెలిపారు.

నారు పెంపకంపై అవగాహన ఉండాలి



రాజుపాలెం: నర్సరీలలో నాణ్యమైన నారునే పెంచాలని ఉద్యాన శాఖాధికారి డి.నవీన్‌కుమార్ తెలిపారు. మండల కేంద్రంలోని రాజుపాలెం రైతు భరోసా కేంద్రంలో మండల స్థాయిలోని నర్సరీ యజమానులకు నారు పెంపకాలపై అవగాహన సమావేశం సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఉద్యాన శాఖాధికారి మాట్లాడుతూ రైతులు విత్తనాలు నాటే సమయంలో తప్పనిసరిగా వారి నుంచి బిల్లు తీసుకోవాలని తెలిపారు. ప్రతీ నర్సరీ యజమాని రిజిస్టర్లను నిర్వహించాలని స్పష్టం చేశారు. ప్రభుత్వ అనుమతులు తప్పనిసరి అని తెలిపారు. లైసెన్సులను రెన్యూవల్ చేయించుకోవాలని సూచించారు. అనంతరం కొండమోడు, రెడ్డిగూడెం, రాజుపాలెం గ్రామాలలో గల నర్సరీలను పరిశీలించారు.

ఇసుక రీచ్‌లో దళారుల దందాపై చర్యలు

అమరావతి: మండల పరిధిలోని వైకుంఠపురం ఇసుక రీచ్‌లో ప్రభుత్వం ప్రవేశ పెట్టిన నూతన ఉచిత ఇసుక పథకంలో దళారుల వసూళ్లపై ఇసుక తోడేస్తున్నారు కథనానికి స్పందన ఇసుక రీచ్‌లలో అధికారులు చర్యలు చేపట్టారు. వైకుంఠపురం ఇసుక రీచ్‌లోకి వాహనం రాగానే టోకెన్ ఇవ్వడం, టోకెన్ నంబరు ప్రకారం బిల్లు రాయడం పద్ధతిని అనుసరించాలని ఉన్నతాధికారులు ఆదేశాలు జారీ చేశారు. ఈ ఆదేశాలను సోమవారం నుంచి అమలు చేస్తున్నారు. అలాగే మునగోడు, మల్లాది గ్రామాల్లో అక్రమ ఇసుక తవ్వకాలు జరక్కుండా రెండు గ్రామాల్లో పోలీస్ పికెట్ ఏర్పాటు చేసినట్లు సీఐ బ్రహ్మం తెలిపారు. ఇసుక రీచ్‌లలో సమస్యలు లేకుండా రవాణా సక్రమంగా సాగటంపై ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

కలుపు నివారణతో.. అధిక దిగుబడి



ఏపీ, అహ్మద్



దిడుగు గ్రామ సమీపంలో పత్తి పైరులో అంతర కృషి

అమరావతి: మండలంలో ఖరీఫ్ సీజన్‌లో అన్ని గ్రామాలలో ప్రత్తి పంటలో ఇప్పటికే రైతులు కలుపు సమస్యను ఎదుర్కొంటున్నారు. గత పదిహేను రోజులుగా వర్షాల కారణంగా రైతులు పొలాన్ని సరిగా దున్నక పోవడం, సిఫార్సు చేసిన దాని కంటే ఎక్కువ మోతాదులో ఎరువులు వేయడం, సరైన నీటి యాజమాన్య పద్ధతులు పాటించకపోవడం వల్ల పంట పొలాల్లో కలుపు విపరీతంగా పెరిగిపోయింది. ఈకలుపు వల్ల పంట దిగుబడి 12 నుండి 51 శాతం వరకు తగ్గడంతో పాటు నాణ్యత తగ్గే ప్రమాదముంది. అనేక రకాల కలుపుమొక్కల వల్ల వివిధ రకాల తెగుళ్ళు, పురుగులకు, ఆశ్రయించటంతో సాగులో ఖర్చు పెరిగి పోతుంది. రైతులు సకాలంలో కలుపును నిర్మూలిస్తే దిగుబడులు పెరిగి, ఖర్చుకూడా తగ్గే అవకాశముంది. మొక్కలు నాటిన తర్వాత తొలి ఆరు వారాలలో కలుపు నివారణకు ఎంతో కీలకమైనది. ఏ రకం కలుపు మొక్కలను ఏ రకం మందులతో నిర్మూలించాలో రైతులు ముందుగా అవగాహన చేసుకోవాలి. పైరులో కలుపును సమర్థవంతంగా సిఫార్సు చేసినమోతాదులోనే ఎరువులు వేసుకోవాలి.ప్రత్తి విత్తిన తర్వాతప్రతి 10రోజులకు ఒకసారి కలుపు తీయించాలి.గ్రామీణ ప్రాంతాలలో పొలాల విస్తీర్ణానికి తగ్గట్టుగా కూలీల లభ్యత లేకపోవటంతో, ప్రస్తుతం కూలీ రేట్లు కూడా పెరగటంతో కలుపుల నివారణకు రైతులు రసాయనిక మందుల పైనే ఆదార పడుతున్నారు.

కలుపు నివారణకు సూచనలు

కలుపు నివారణకు తీసుకోవాల్సిన చర్యల గూర్చి మండల వ్యవసాయశాఖాధి కారి రైతులకు వివరిస్తూ కలుపు మందులు వేసినప్పటికి ప్రత్తి పైరులో 25నుండి 30రోజుల వరకు పనిముట్లతో అంతర కృషిచేయాలన్నారు.పంటకు సరిపోయే కలుపు మందులు సరైనమోతాదులో సరైన సమయంలో వాడాలన్నారు. విత్తనం వేయగానే 24నుండి48గంటలలోపు కలుపు మందులు పిచికారి చేయాలని, కలుపు మందును ఫవర్ స్ప్రేయర్‌తో పిచికారి చేయకుండా, హ్యాండ్ స్ప్రేయర్ తోనే స్ప్రేచేయాలన్నారు. భూమిలో బాగా పదును ఉన్నప్పుడు మాత్రమే కలుపు మందులు చల్లటం లాభదాయకమని, కలుపు మందులు వేసిన తర్వాత కనీసం 6గంటల వరకు వర్షం పడకుండా ఉండాలని, కలుపు మందులను ఉదయం లేదా సాయంకాలం మాత్రమే పిచికారి చేయాలన్నారు.అలాగే వ్యవసాయాధికారుల సలహా మేరకు ఎకరాకు ఎందు లీటర్ల పెండిమిథాలిన్,ఒక లీటరు గ్రామోక్సిన్‌ను 200లీటర్లలో కలిపి మొక్కల పై పడకుండా పిచికారి చేయాలన్నారు.

విద్యార్థులకు విందు భోజనం



విద్యార్థులకు భోజనం వడ్డిస్తున్న ఎంపీడీవో కుసుమకుమారి

అచ్చంపేట: సామాజిక భాగస్వామ్య దినోత్సవం 'శుభదిన్ భోజన్ శిక్షా సప్తాహ్' కార్యక్రమంలో భాగంగా మండలంలోని తాడువాయి తండాలో గల మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో సోమవారం విద్యార్థులకు విందు భోజనం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ముఖ్య అతిథులుగా ఎంపీడీవో కుసుమకుమారి, ఇన్‌చార్జి తహసీల్దారు జానీ బాషా హాజరయ్యారు. ఎంపీడీవో మాట్లాడుతూ తండా ప్రముఖులు బాణావతు వెంకటేశ్వర్లు సహకారంతో విద్యార్థులకు అన్ని రకాల కూరలు, పిండి వంటలతో విందు భోజనం ఏర్పాటు చేయడం ఎంతో అభినందనీయమన్నారు. బడికి వెళ్లాల్సిన వయస్సులో.. పొలాల బాట పట్టే విద్యార్థులను బడికి రప్పించేందుకు ఇలాంటి కార్యక్రమాల నిర్వహణకు గ్రామస్తులు ముందుకు రావాలన్నారు. ఇప్పుడు విద్యార్థులకు అవసరమైన అన్ని సౌకర్యాలతో కార్పొరేట్ స్థాయిలో ప్రభుత్వ బడులు తయారయ్యాయని చెప్పారు. తల్లిదండ్రులు తమ పిల్లలను బడిబాట పట్టించాలని, ప్రభుత్వ ఆశయం, పెద్దల సహకారంతో బాగా చదువుకునేందుకు దోహదపడాలని చెప్పారు. పాఠశాల హెచ్ఎం ఆళ్లమూడి వెంకటేశ్వరరావు మాట్లాడుతూ తండా వాసులు బాణావతు వెంకటేశ్వర్లు సుమారు రూ.20వేల ఖర్చుతో విద్యార్థులకు విందు భోజనాలు ఏర్పాటు చేయడం చాలా సంతోషంగా ఉందన్నారు. ఇలాంటి భోజన కార్యక్రమాలు నెలలో కనీసం ఒక్కసారైన ఏర్పాటు చేసుకుంటే విద్యార్థులలో ఉత్తేజం పెరిగి చదువు పట్ల ఆశక్తి పెరుగుతుందని చెప్పారు. భోజన దాత వెంకటేశ్వర్లు దంపతులను అభినందించారు. మాజీ ఎంపీపీ భూక్యా కృష్ణానాయక్, బాలు నాయక్, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

ఘర్షణలో ఇద్దరికి గాయాలు

రెంటచింతల: రెంటచింతలలో ఆదివారం రాత్రి ఇరు వర్గాల మధ్య ఘర్షణ జరిగినట్లు ఎస్సై ఎం.ఆంజనేయులు సోమవారం తెలిపారు. గ్రామంలోని ఎర్రబాలెం కాలనీలో టీడీపీ - వైఎస్సార్‌సీపీ వర్గాలకు చెందిన వారు ఒకరిపై ఒకరు దాడి చేసుకోవడం వలన బోయిన చౌడయ్య, పేర్ల శ్రీనివాసులకు గాయాలైనట్లు వెల్లడించారు. ఇరువురి ఫిర్యాదుల మేరకు 10 మందిపై కేసులు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు. గ్రామాలలో ఎవరైనా ఇతరులను ఇబ్బంది పెట్టే విధంగా మాట్లాడినా.. వ్యక్తిగత కారణాలతో ఘర్షణ పడి పార్టీల రంగు పులిమిన వారిపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

అధిక ఫీజులు వసూలు చేస్తున్న విద్యాసంస్థలపై చర్యలు



డెప్యూటీ తహసీల్దార్ రవికుమార్‌కు వినతిపత్రం అందజేస్తున్న గిరిజన సంఘ నాయకులు

చిలకలూరిపేట: ప్రైవేటు, కార్పొరేట్ పాఠశాలల్లో ఫీజుల దోపిడీని ప్రభుత్వం నియంత్రించాల్సిన అవసరం ఉందని ఏపీ గిరిజన సంఘాల ఐక్యవేదిక అధ్యక్షుడు బి.శ్రీనునాయక్ పేర్కొన్నారు. సంఘ ఆధ్వర్యంలో సోమవారం డెప్యూటీ తహసీల్దార్ ఎస్.రవికుమార్‌కు ఈ మేరకు వినతి పత్రం అందజేశారు. ఆయన మాట్లాడుతూ ఫీజుల నియంత్రణకు ప్రభుత్వం పటిష్టమైన చట్టం చేయాలని కోరారు. అధిక ఫీజులు వసూలు చేస్తున్న పాఠశాలలపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కొన్ని పాఠశాలల వారు వారి పేర్ల పక్కన నిబంధనలకు విరుద్ధంగా ఐఐటీ ఫౌండేషన్ వంటి పేర్లు తగిలించుకుంటున్నారని విమర్శించారు. విద్యా సామగ్రితో పాటు, యూనిఫాం వంటివి వారి పాఠశాలల్లోనే కొనుగోలు చేయాలని ఇబ్బందులకు గురి చేస్తున్నారని ఆరోపించారు. నిబంధనలు ఉల్లంఘిస్తూ విద్యార్థుల తల్లిదండ్రులను అవస్థలకు గురి చేస్తున్న విద్యాసంస్థలను గుర్తించి చర్యలు చేపట్టాలని కోరారు. కార్యక్రమంలో సంఘ నాయకులు బి.చిన్నానాయక్, దేవర డేవిడ్, ఆర్.శ్రావణ్‌నాయక్ పాల్గొన్నారు.

నర్సరీలకు లైసెన్స్ తప్పనిసరి



వెల్లటూరులో నర్సరీని సందర్శించి యజమానికి సూచనలు చేస్తున్న ఉద్యాన శాఖ అధికారి

బొల్లాపల్లి: నర్సరీ యజమానులు నిబంధనలు తప్పనిసరిగా పాటించాలని వినుకొండ ఉద్యాన శాఖ అధికారి షేక్ నబీ రసూల్ అన్నారు. మండలంలోని వెల్లటూరు, పేరూరుపాడు, సరికొండపాలెం గ్రామాల పరిధిలోని షేడ్‌నెట్ నర్సరీలను సోమవారం సందర్శించారు. రికార్డులను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా రబీ రసూల్ మాట్లాడుతూ 2010 నర్సరీ చట్టం ప్రకారం రిజిస్ట్రేషన్ చేసుకోవాలని కోరారు. షేడ్‌నెట్‌కు 9 నుంచి 14 అడుగల ఎత్తు వరకు ఇన్‌సెట్‌కు నెట్‌తో రక్షణ కల్పించాలని వివరించారు. డబుల్ డోర్ సిస్టమ్ కలిగి ఉండాలని, కీటకాలు లోపలికి ప్రవేశకుండా షేడ్‌నెట్‌కు ఎటువంటి రంధ్రాలు లేకుండా చూసుకోవాలని సూచించారు. నర్సరీ యజమానులు నాణ్యమైన విత్తనాలను వాడాలని సూచించారు. శుద్ధి చేసిన కోకో పిట్‌తో ప్రోట్రేలలో మిరప విత్తనాలను ఏర్పాటు చేసి ఎత్తుగా ఉన్న మడులపై అమర్చాలని కోరారు. రైతులకు నాసిరకం నారు అందిస్తే నర్సరీ చట్టం ప్రకారం కఠినచర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అధిక ధరలకు మిరప నారును విక్రయించినా, లైసెన్స్ లేకుండా షేడ్‌నెట్స్ మిరపనారు వ్యాపారం చేసినా శాఖాపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు. కార్యక్రమంలో ఉద్యాన సహాయకురాలు బి.కోహిని, నర్సరీ యజమానులు తదితరులు ఉన్నారు.

ప్రభుత్వ పథకాల పక్కాగా అమలు చేయాలి

ఎంపీడీఓ కవితాచౌదరి



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీడీఓ కవితాచౌదరి

శావల్యాపురం: ప్రభుత్వ పథకాలు అమలు తీరులో అధికారులు కీలకపాత్ర పోషించాలని ఎంపీడీఓ కొర్రపాటి కవితాచౌదరి అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులు, గ్రామ సచివాలయ ఉద్యోగులతో ప్రభుత్వ పథకాలు విధి విధానాలపై సమీక్ష సోమవారం నిర్వహించారు. ఎంపీడీఓ మాట్లాడుతూ గ్రామాల్లో వర్షాకాలంలో ప్రజలు అంటువ్యాధుల బారిన పడకుండా ముందు జాగ్రత్త చర్యలు చేపట్టాలని, పంచాయతీ కార్యదర్శులకు సూచించారు. గ్రామ, మండల స్థాయిలో శానిటేషన్ నిర్వహణపై కంట్రోల్ కమాండ్ అధికారులు టీమ్ సభ్యులు నిరంతరం పర్యవేక్షణ చేయాలని కోరారు. మండలంలోని మతుకుమల్లిలో తాగునీటి పథకం పనిచేయటం లేదని త్వరితగతిన పనులు అయ్యేలా క్షేత్ర స్థాయిలో చర్యలు తీసుకుంటామన్నారు. ఇందుకు గాను గ్రామంలోని తాగునీటి చెరువు నిండా సాగర్ జలాలు నింపినట్లు ఈఓపీఆర్డీ పి.సుగుణ అన్నారు.

ఆరుగురు జూదరుల అరెస్ట్

అమరావతి: మండల పరిధిలోని మునగోడు బస్టాండు వెనుక ఉన్న డంపింగ్ యార్డు సమీపంలో సోమవారం జూదమాడుతున్న అరుగురుని అమరావతి పోలీసులు అరెస్టు చేశారు. సమాచారం మేరకు దాడి చేయగా.. పేకాట ఆడుతున్న అరుగురుని అదుపులోకి తీసుకుని, వారినుంచి రూ. 7,420లు నగదును స్వాధీనంచేసుకున్నట్లు తెలిపారు. వీరిపై కేసునమోదుచేసి, సత్తెనపల్లికోర్టులో హాజరుపరుస్తున్నట్లు సీఐ బ్రహ్మం తెలిపారు.

విద్యుదాఘాతంతో గేదె మృతి



బెల్లంకొండ: విద్యుదాఘాతంతో పాడి గేదె మృతి చెందిన ఘటన మండల కేంద్రమైన బెల్లంకొండలో సోమవారం చోటుచేసుకుంది. గేదె యజమాని పాకాలపాటి షేక్ మహబూబ్ తెలిపిన వివరాల ప్రకారం.. సోమవారం రోజు మాదిరిగా మేతకు గెదెను తీసుకెళ్లగా.. మధ్యాహ్న సమయంలో కొత్తపాలెం రోడ్డులో ఉన్న కాలువ సమీపంలో విద్యుత్ ఎర్త్ వైరు తగిలి గేదె అక్కడికక్కడే మృతి చెందినట్లు తెలిపారు. ఎర్త్ వైర్ చుట్టూ ఫెన్సింగ్ వేయమని విద్యుత్ సిబ్బందికి ఎన్నోమార్లు చెప్పినా పట్టించుకోలేదన్నారు. వారి నిర్లక్ష్యం వల్లే తన గేదె చనిపోయినట్లు యజమాని వాపోయాడు. ఘటనపై పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు మహబూబ్ తెలిపారు.

ఆదర్శానికి మారు పేరు డొక్కా సీతమ్మ

కారెంపూడి: ఆకలి తీర్చడం కోసం యావదాస్తిని, తన కష్టాన్ని త్యాగం చేసిన ఆదర్శమూర్తి డొక్కా సీతమ్మ అని, అలాంటి త్యాగమూర్తి పేరు విద్యార్థుల మధ్యాహ్న భోజన పథకానికి ప్రభుత్వం పెట్టడం ఆదర్శవంతమైన నిర్ణయమని జన సేన పార్టీ మాచర్ల నియోజకవర్గ ఇన్‌చార్జి బూసా రామాంజనేయులు సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. మాచర్ల నియోజకవర్గంలోని పలు పాఠశాలల్లో సోమవారం మధ్యాహ్న భోజనం కార్యక్రమంలో జన సేన కేడర్ పాల్గొని, విద్యార్థులకు స్ఫూర్తివంతమైన డొక్కా సీతమ్మ జీవిత చరిత్రను ఉపాధ్యాయులు వివరించాలని పేర్కొన్నారు. కారెంపూడి జెడ్పీ హైస్కూల్లో సోమవారం మధ్యాహ్న భోజన సమయంలో ఆ పార్టీ మండల అధ్యక్షుడు కేసానుపల్లి కృష్ణబాబు, పార్టీ నాయకులు ఎస్ఎంకే నాయుడు, పాలెపోగు బాబు, మిరియాల అశోక్, కొండా పవన్, పలిశెట్టి వినయ్ పాల్గొని విద్యార్థులకు ఆహార పదార్థాలు వడ్డించారు.

ఫేక్ వీడియో వైరల్‌పై కేసు నమోదు

నరసరావుపేట టౌన్: పట్టణంలో జంట హత్యలు జరిగినట్లు సామాజిక మాధ్యమాల్లో అసత్య ప్రచారాన్ని వైరల్ చేసిన యువకులపై కేసు నమోదు చేసినట్లు వన్‌టౌన్ సీఐ సిహెచ్.కృష్ణారెడ్డి సోమవారం తెలిపారు. వివాహేతర సంబంధం నేపథ్యంలో ఓ మహిళ, పురుషుడు రామిరెడ్డిపేటలో హత్య చేయబడ్డారంటూ ఆదివారం సామాజిక మాల్లో వైరల్ అయింది. దీనిపై పల్నాడు జిల్లా ఎస్పీ కె.శ్రీనివాసరావు స్పందించి విచారణకు ఆదేశించారు. వీడియో నాలుగు రోజుల నుంచి సామాజిక మాధ్యమాల్లో కొందరు యువకులు కావాలని వైరల్ చేస్తున్నట్లు తెలుసుకున్నారు. ఘటన నరసరావుపేటలో జరిగింది కాదని తేల్చారు. దీంతో ప్రజలను భయాందోళనకు గురిచేసే వీడియోలు సామాజిక మాధ్యమాల్లో వైరల్ చేసిన యువకులపై కేసు నమోదు చేశారు.

కళాశాల పీపుల్ లీడర్ ఎన్నికలు



సిరా చూపుతున్న విద్యార్థినులు

సత్తెనపల్లి: విద్యార్థులకు ఎన్నికల పట్ల అవగాహన కల్పించేందుకు కళాశాలలో పీపుల్ లీడర్ ఎన్నికలు నిర్వహించడం జరిగిందని వేద కళాశాల ప్రిన్సిపల్ అరుణ తెలిపారు. పట్టణంలోని వేద జూనియర్ కళాశాలలో సోమవారం విద్యార్థులకు తమ ప్రతినిధిని ఎన్నుకొనేందుకు ఎన్నికలు నిర్వహించారు. ప్రచారం, నామినేషన్, బ్యాలెట్, చేతికి సిరా గుర్తు, సీక్రెట్ ఓటింగ్, తదితర ఎన్నికల ప్రక్రియ మొత్తం నిర్వహించారు. విద్యార్థులు ఎన్నికల విధానం పై మంచి అవగాహన పొందారు. కళాశాల పీపుల్ లీడర్, కళాశాల వైస్ పీపుల్ లీడర్‌లను ఎన్నుకునేందుకు విద్యార్థులు ఈవీఎంల మాదిరి యంత్రం ద్వారా ఓటు హక్కు వినియోగించుకున్నారు. ఎన్నికల విధుల్లో సైదా నాయక్, విక్రమ్ సింహ, అనూష, ప్రియ సూర్య ప్రకాష్ పాల్గొని, అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో విద్యార్థులు పాల్గొన్నారు.

ఆదర్శ పాఠశాలలో శుభ్ దిన్ భోజనం



శుభ్‌దిన్ భోజన కార్యక్రమం



భోజనం చేస్తున్న విద్యార్థులు

క్రోసూరు: ఏపి మోడల్ స్కూల్ నందు శుభ్ దిన్ భోజన కార్యక్రమం సోమవారం నిర్వహించినట్లు పాఠశాల ప్రిన్స్‌పల్ మేరీ సుజన్ తెలిపారు. ఈసందర్భంగా ప్రిన్స్‌పల్ మాట్లాడుతూ ఆనందాన్ని సమాజానికి పంచాలన్న సదుద్దేశంతో ఆంధ్రప్రదేశ్ విద్యాశాఖ ఈ పథకాన్ని మధ్యాహ్న భోజనంలో అమలు చేస్తున్నట్లు తెలిపారు. విద్యార్థులకు దాతలెవరైనా భోజనం గానీ, పండ్లు, స్వీట్లు గానీ అందచేసే కార్యక్రమం చేపట్టినట్లు తెలిపారు. అందులో భాగంగా అనంతవరం గ్రామ వాసి, మండల టీడీపీ అధ్యక్షుడు దూళ్ల సాంబశివరావు విద్యార్థులకు స్వీట్ కేసరిని అందించినట్లు చెప్పారు. ఈ కార్యక్రమం వారోత్సవాలుగా నిర్వహిస్తున్నట్లు ప్రిన్స్‌పాల్ వెల్లడించారు.

దమ్మాలపాడులో..

దమ్మాలపాడు(ముప్పాళ్ళ): శిక్షా సప్తాహ్‌లో భాగంగా దమ్మాలపాడు గ్రామంలో రామాపురం కాలనీ ఎంపీపీ పాఠశాలలో శుభ్ దిన్ తిథి భోజనం సోమవారం ఏర్పాటు చేశారు. గ్రామానికి చెందిన ఈపూరి సాంబిరెడ్డి సాయంతో 80 మంది విద్యార్థులకు సన్న బియ్యంతో వెజ్ బిర్యానీ, టమాటో కోడిగుడ్డు కూర, పెరుగు చట్నీ, నారింజ కాయను అందించారు. విద్యార్థులు, ఉపాధ్యాయులు సహపంక్తి భోజనం చేశారు. ఈ సందర్భంగా దాతను ఉపాధ్యాయులు, విద్యార్థులు అభినందించారు. ప్రధానోపాధ్యాయులు తోకల అచ్చయ్య, ఉపాధ్యాయులు సురేష్, కళ్యాణి, వేణుమాధవి, సతీష్ పాల్గొన్నారు.

శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తే చర్యలు

నాగవరంలో ఎస్ఐ షఫీ పల్లెనిద్ర



నాగవరం పల్లెనిద్రలో ఎస్ఐ షఫీ

నాగవరం(క్రోసూరు): జిల్లా ఎస్పీ శ్రీనివాసరావు ఆదేశాల మేరకు మండలంలోని నాగవరం గ్రామంలోఎస్ఐ ఎం.షఫీ గ్రామ పంచాయతీ కార్యాలయంలో పల్లెనిద్ర కార్యక్రమం ఆదివారం రాత్రి చేపట్టారు. ఈ సందర్భంగా గ్రామ పెద్దలతో సమావేశం నిర్వహించారు. ఎస్ఐ మాట్లాడుతూ గ్రామ పరిస్థితులు నిత్యం తెలుసుకుంటున్నామని, శాంతి భద్రతలకు విఘాతం కలిగిస్తే పోలీసులు కఠిన చర్యలు తీసుకుంటారని హెచ్చరించారు. ఎవరూ ఎటువంటి గొడవలు, ఘర్షణలకు పాల్పడవద్దని హితవు పలికారు. ఎన్నికల్లో గెలుపోటములు సహజం గా ఉంటాయన్నారు. గెలిచిన వారు హుందాగ ఉండాలని, ఓడిన వారు రెచ్చగొట్టే వ్యాఖ్యలు చేయడకుండా అందరూ స్నేహపూర్వకంగా మెలగాలని కోరారు. ముందుగా గ్రామంలోని అన్ని వీధుల్లో ఎస్ఐ, సిబ్బంది తిరిగారు. గ్రామ పెద్దలు కూడా పోలీసులకు సహకరిస్తామని మాట ఇవ్వడం జరిగిందన్నారు.

విత్తనాలను ఎమ్మార్పీకే విక్రయించాలి



గణపవరంలో విత్తన దుకాణంలో రిజిస్టర్లను పరిశీలిస్తున్న వ్యవసాయాధికారి

రాజుపాలెం: విత్తనాలను ఎమ్మార్పీకే కంటే అధికంగా విక్రయిస్తే.. విత్తన దుకాణాల యజమానులపై కఠిన చర్యలు తీసుకుంటామని మండల వ్యవసాయాధికారి వెంకట నర్సయ్య హెచ్చరించారు. మండలంలోని గణపవరంలో ఉన్న కీర్తీ సీడ్స్, సాంబశివ ఏజెన్సీ, శ్రీవెంకటేశ్వర సీడ్స్ దుకాణాల్లో ఏవో తనిఖీలు నిర్వహించారు. తనిఖీల్లో భాగంగా స్టాకు రిజిస్టర్లను, బోర్డులను, బిల్లు పుస్తకాలను పరిశీలించారు. అక్కడ ఉన్న రైతులను విచారించగా విత్తనాలను ఎమ్మార్పీ కే ఇస్తున్నారని వారు తెలిపారు. బిల్లులో వేసిన రేటు ప్రకారం రైతులు చెల్లించాలని, ఎక్కువ చెల్లించరాదని తెలిపారు. కృత్రిమంగా విత్తనాలు కొరత ఏర్పడిందని సృష్టించి ఎక్కువ ధరలకు విక్రయించినట్లయితే.. చట్టప్రకారం చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఆయన వెంట వ్యవసాయ సహాయకులు తదితరులు ఉన్నారు.

అటెండర్‌గా రమేష్ సేవలు వెలకట్టలేనివి



రమేష్ దంపతులను సత్కరిస్తున్న ఎంఈఎఫ్ నాయకులు

సత్తెనపల్లి: రిటైర్డ్ అటెండర్ రమేష్ సేవలు వెలకట్టలేనివని మాదిగ ఉద్యోగుల సమైక్య నాయకులు అన్నారు. పట్టణంలోని బాగ్స్ మెమోరియల్ బాప్టిస్ట్ టౌన్ చర్చిలో మాదిగ ఉద్యోగుల సమైక్య (ఎంఈఎఫ్) ఆధ్వర్యంలో సత్తెనపల్లి మున్సిపాలిటీలో గత 28 సంవత్సరాలు బోరింగ్ పంపుల అటెండర్‌గా పని చేసి, రిటైర్ అయిన గర్నెపూడి రమేష్‌కి ఆత్మీయ సత్కారం సోమవారం నిర్వహించారు. సభకు వజ్రాగిరి విజయవర్ధన్ అధ్యక్షత వహించారు. పలువురు మాదిగ ఉద్యోగులు రమేష్ చేసిన సేవలను కొనియాడారు. రమేష్ దంపతులను దుశ్శాలువాలు, మెమెంటోలతో సత్కరించారు. అనంతరం ముప్పాళ్ల దమ్మాలపాడు గ్రామానికి చెందిన చింతపల్లి రుద్రయ్య కుమారుడు వంశీ అనే నిరుపేద విద్యార్థికి రూ. 3వేలు ఆర్థిక సాయం అందించారు. ఈ కార్యక్రమంలో ఎంఈఎఫ్ నాయకులు గర్నెపూడి సాల్మన్, జడ్సన్, బుల్లా రామారావు, కలపాల ప్రేమ్ కుమార్, పి. రమేష్, జి. ఏసురత్నం, జి. శ్యాం, కె. అచ్యుత్ రాజు, కె.కృపారావు, సీహెచ్ జాన్సన్, ఎస్.ఆదాము, కె.జూలీ, ఎం.శ్రీలక్ష్మి, సుమలత, విల్సన్, వెంకటేశ్వ రావు, అశోక్ తదితరులు పాల్గొన్నారు.

కష్టపడి చదివి మంచి పేరు తెచ్చుకోవాలి



విద్యాసామగ్రి పంపిణీ చేస్తున్న కొత్త రామకృష్ణ

సత్తెనపల్లి: ప్రతి విద్యార్థి కష్టపడి చదివి మంచి పేరు తెచ్చుకోవాలని సత్తెనపల్లి ఏరియా వైద్యశాల అభివృద్ధి కమిటీ మాజీ డైరెక్టర్ కొత్త రామకృష్ణ అన్నారు. పట్టణంలోని వడ్డవల్లి 19వ వార్డులో గల ఎంపీపీ(హెచ్ఈ) పాఠశాలలో శుభ దిన్ (తిథి) కార్యక్రమంలో భాగంగా పాఠశాల విద్యార్థులకు విద్యా సామగ్రి, పండ్లు, రొట్టెలు సోమవారం ఆయన వితరణ చేశారు. ఈ సందర్భంగా కొత్త రామకృష్ణ మాట్లాడుతూ ఇక్కడ చదువుకునే ప్రతి విద్యార్థి భవిష్యత్తులో మంచి ప్రయోజకులు అవ్వాలన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్యా బోధన అందించే ఉపాధ్యాయులు ఉన్నారని, వారి ద్వారా నాణ్యమైన విద్యను అభ్యసించాలన్నారు. వార్డు కౌన్సిలర్ అవ్వారు శ్రీనివాసరావు మాట్లాడుతూ 19వ వార్డులో ఉన్న ప్రభుత్వ ప్రైమరీ పాఠశాల అన్ని విధాలుగా బాగుందని, తాము అడగగానే పాఠశాలకు విద్యాసామగ్రిని వితరణ చేసిన కొత్త రామకృష్ణకు అభినందనలు తెలిపారు. ప్రభుత్వ ఏరియా వైద్యశాలను కార్పొరేట్ వైద్యశాలకు దీటుగా అభివృద్ధి చేసేందుకు రామకృష్ణ ఎంతో కృషి చేశారన్నారు. సేవా మార్గంలో అందరి కన్నా ఒక అడుగు ముందుంటాడని కొనియాడారు. విద్యాసామగ్రి వితరణ చేసిన కొత్త రామకృష్ణ, వార్డు కౌన్సిలర్ శ్రీనివాసరావుకు పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు కె.భాగలక్ష్మి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు రెహనా, దుర్గాదేవి, ఏఎస్ఎం డి.లక్ష్మి, ఆశ వర్కర్ శైలజ, విద్యార్థులు తదితరులు ఉన్నారు.